# ఒట్టిమాటలు-గట్టిమేలు

శివజ్యోతినగర్‌లో స్నేహితుడిని కలుసుకు మాట్లాడి సెలవు తీసుకునే సరికి చాలా పొద్దు పోయింది. 'బైపాస్' రోడ్ మీద లీలామహల్ వరకు నడిస్తే తప్ప, రిక్షా వంటిది యేమీ దొరకదు.

"టీ తాగాలన్నా అంతవరకు వెళ్లవలసిందే. పదండి, మేం కూడా వస్తాం. మిమ్మల్ని పంపినట్లూ ఉంటుంది. ఓ గుక్కెడు వేడినీళ్లు గొంతులో పోసుకున్నట్లూ అవుతుంది" అన్నాడు మిత్రుడు. వెంటవున్న మరి యిద్దరి అంగీకారం కూడా తలఊపుతోనే పొందుతూ.

నలుగురూ నడవడంతో దూరం తరిగి పోవడం మొదలయింది. సంభాషణ జీవితాన్ని గురించి, అందులో మనిషిపడే యాతనల గురించి సాగుతోంది. కీర్తి అంత జాగ్రత్తగా వినకుండానే నడక సాగిస్తున్నాడు. ఎప్పుడూ ఒకటేరకం మాటలు, నేలబారు ఆలోచనలు. డబ్బు, సంపాదన, ఉద్యోగం, ప్రమోషన్లు, పెళ్లిళ్లు, పేరంటాలు తప్ప మనిషికి యితర ప్రసక్తి ఉన్నట్లే అనిపించదు. పక్కవాడితో పోల్చి చూచుకోవడం, సరితూగుతున్నానని తృప్తి పడడం తప్ప మరో యావ ఉన్నట్లే కనిపించదు.

మాట్లాడుతున్నవాళ్లలో ఒకతను "అవన్నీ అట్లా ఉండనీయండి. మనిషికి పూర్తిగా 'తెలివి' ఎప్పుడు వికసిస్తుందంటారు?" అనడిగాడు.

కీర్తి మనసులో అంచనా వేసుకుంటున్నాడు. తెలివి వికసించడం అంటే? చంద్ర గ్రహానికో - కుజగ్రహానికో పోవడమా? ఈ భూమండలంలోనే అందరు మనుషులు చక్కగా కులాసాగా అరమరికలు లేకుండా కాలక్షేపం చేయడమా?

టీ దుకాణం వచ్చింది.

కీర్తి, "నేను టీ తీసుకోను, గదికి వెళ్లే ముందు యే భీమాస్‌లోనో కాస్త టిఫిన్ కూడా తీసుకోవాలి. మరి సెలవు," అని కుడివైపు తిరిగాడు.

ఓ వక్కగా అయిదారు రిక్షాలు ఉన్నాయి. వాటి తాలూకు డ్రైవర్లు ఒక చోట గుమిగూడి కబుర్లు చెప్పుకుంటున్నారు. బేరంలో వాళ్లకేమీ అసక్తి ఉన్నట్లు కనిపించలేదు కీర్తికి. మరో వక్క ఓ దుకాణం ముందు రిక్షా బండి ఆగివుంది. దాని తాలూకు మనిషి అయిఉండాలి, ఆ దుకాణంలో బీడీలు కొనుక్కుంటున్నాడు. బీడీ వెలిగించుకుని రెండుదమ్ములు తీసేంతర్వాత బండి వేగంగా నడిపిస్తాడు కావును.

కీర్తి బండి వక్కనే నిలబడ్డాడు.

అతను రెండు నిమిషాలలో రానే వచ్చాడు.

గంట మోగింది. బండిని ముందుకులాగాడు, కీర్తిని పట్టించుకోకుండా.

"ఏమయ్యా, నీ కోసం నిదానంగా నిలబడితే పలకరించకుండానే ముందుకు పోదామని చూస్తున్నావే. నన్ను రూంకు చేర్చవా యేమిటి?" అన్నాడు కీర్తి బండి అతనితో - యేదో బంధువుతో మాట్లాడినంత ఆప్యాయంగా.

అప్పుడు చూచాడు యితని వంక బండి అతను, తాపీగా.

పెదవుల మధ్య ఉన్న బీడీ చేత్తో అందుకుని "టైమెంత అయిందండీ?" అన్నాడు.

కీర్తికి సమాధానం దొరకలేదు. యాంత్రికంగా ఎడంచేతి వయివు చూచుకుని "ఎనిమిదీ - యిరవయి" అన్నాడు.

"రండి" అన్నాడు బండి అతను, సీట్ గట్టిగా దులిపి సరిచేస్తూ.

కీర్తి కూర్చున్నాడు. రిక్షా ఎగుడు దిగుడుల రోడ్డు మీద ముందుకు నడుస్తోంది.

"నేను టైం ఎందుకు అడిగాను అనుకుంటున్నారా?" అన్నాడు అతను. నేనేమీ అనుకోవడంలేదు, నా అలోచనల్లో నేను మునిగిపోయి ఉన్నాను - అనుకున్నాడు గాని పైకి మాత్రం యేమీ అనలేదు కీర్తి.

"ఈ సినిమాహాల్లో మంచి బొమ్మ వచ్చింది. అది యివాళ చూచి తీరాలని అనుకున్నాను" అన్నాడు.

మంచిదని యితనికి ఎలా తెలుసు? పత్రికలలో రివ్యూలు, పరిచయాలు చదువుతాడా - లేక జనవాక్యం సేకరిస్తాడా? లేక దాన్లోని నటీనటులను గురించి తానే అంచనా వేసుకుంటాడా?

– ఈమాటే అడిగాడు కీర్తి.

"బాగా అడిగారు మీరు" అన్నాడు ఎదురుగా వస్తున్న రెండు కుక్కల్ని తప్పించుకుంటూ.

"నాది ఈ వూరే అనుకుంటున్నారా?" అన్నాడు మళ్ళీ రోడ్ క్లియర్ అయిన తరువాత.

నేను యేం అనుకుంటున్నాను అన్నదాని మీద యితనికి ఎందుకో యింత శ్రద్ధ అనిపించింది కీర్తికి.

అతనే సమాధానం చెప్పాడు. "అబ్బే నాది యీ వూరు కాదండీ. నేను గూడూర్లో ఉంటాను. పది రోజులయింది వచ్చి. అక్కడ గూడూర్లో నేనేం చేస్తూంటానను కుంటున్నారు? ఇలాగే బండి లాగుతాననుకుంటున్నారా? కాదు, ఓ సినిమాహాల్లో పని చేస్తాను. ఆ హాల్లో - పోయిన నెలంతా ఈ సినిమా గురించే 'ట్రయల్' వేసి చూపించారు. చాలా బాగుంటుందనిపించింది లెండి. అందుకని..."

కీర్తి నిదానంగా విన్నాడు. ఇతను చూచి మరీ నిర్ణయించుకుంటున్నాడు. చెప్పేడు మాటలు వినడంలేదు.

"మా వూళ్ళోనే ఉన్నట్లయితే యీ సినిమా చూడడం కోసం ప్రత్యేకంగా టైం కేటాయించుకుని, డబ్బులు కర్చు చేసి చూడనక్కర్లేదు."

అప్పుడు గమనించాడు కీర్తి, యీ బండి అతను తన అంత స్పష్టంగానూ, ఉచ్చారణ దోషాలు - యాసలు లేకుండాను మాట్లాడుతున్నాడు "మళ్ళీ నేను వూరు వెళ్ళేటప్పటికి ఈ సినిమా అక్కడ వుండకపోవచ్చును. అందుచేత ఆ మొక్కుయేదో యిక్కడే తీర్చేసుకుందాం అనుకుంటున్నాను."

కీర్తి "బాగుంది" అన్నాడు - యీమారు పైకే.

"మీరు యీ సినిమా చూచారా?"

"ఊహూ" - ఎందుకు చూడలేదు కారణం అడుగుతాడేమోనని భయపడ్డాడు కీర్తి. ఎంతసేపు పుస్తకాలు చదవడం. వాటి గురించి ఇతరులతో చర్చించడం తప్ప యింకేం చేయడం తనకు చేతకాదని యితనికి చెప్పడం ఎట్లా?

"పోనీలెండి" అన్నాడు అతను యితని అభిప్రాయం కనిపెట్టినట్లు.

"అసలు ఈ వూరు ఎందుకు వచ్చాననుకుంటున్నారు?" అన్నాడు మళ్లీ అతను. తాను జవాబు చెప్పనవసరం లేదని, కీర్తికి తెలిసిపోయింది ఈసరికి.

"మా పెద్దమ్మ వుంది యీ వూళ్ళో." పేదరాసి పెద్దమ్మా? నవ్వుకు

న్నాడు కీర్తి.

ఎప్పుడు చూచినా నేల యీనినట్లు జనం కనిపించే రోడ్లు వున్న యీ వూళ్లో, మేఘాల మీదికి దుముక చూసే పర్వత శిఖరాలు వరుసగా కనిపించే యీ వూళ్లో, ఆకాశం వేపు పొడుచుకు పోతున్న గుడి గోపురాల మీద పసిడి కాంతులు విరజిమ్ముతూ సువర్ణ కలశాలు ఎన్నో ఉన్న యీ వూళ్ళో... చిన్నమ్మకూ చిద్విలాసుడికీ స్వస్థలం అయిన యిక్కడ.... పెద్దమ్మ ఉందా? అని అక్కజపడ్డాడు కొన్ని క్షణాలు.

"మా పెద్దమ్మకు మూడు నెలలయి బాగా సుస్తీ చేసింది."

పాపం అనుకున్నాడు.

"అసలు మళ్ళీ చూడగలుగుతాననుకోలేదులెండి. అప్పుడు రావటానికి నాకు సెలవు దొరకలేదు. మా సినిస్పాహోలు యజమాని - ఇప్పుడు - కాదు - అప్పుడుకాదు - అంటూ యింతదూరం చేశాడు. అయినా ఎప్పటికప్పుడు కబుర్లు అందుతూనే ఉన్నాయిలెండి. అందుకనే ఆలస్యం అయింది."

కీర్తికి కళ్లలో నీళ్లు తిరిగాయి. అతను తన ముఖంలోకి చూడలేదు గనుక నిదానంగా కళ్లు ఒత్తుకున్నాడు చేతి గుడ్డతో.

కన్న తల్లికి ఎన్నిమార్లో సుస్తీగా ఉంటే, కబురు తెలిసినా వెళ్లిరావడం కుదరలేదు కీర్తికి అనేకమార్లు. ఎప్పుడూ ఆర్థిక చిక్కులు (డబ్బులేకపోవడం - అని తేలిక భాషలో చెప్పకోగూడదు), ఆఫీసు గందరగోళాలు, అయినా "త్వొందరపడి యింత దూరం రావలసిన అవసరం లేదు. కాస్త నిదానంగానే వుంది." అని ఉత్తరాలు వచ్చేవి. అక్కడ ఎంత యిబ్బందిగా వున్నా, అందుకని నిదానించి ఊరుకునేవాడు.

మమతలు, ఆప్యాయతలు మాటల్లో లేవు - చేతల్లోనూ లేవు.

తరువాత కలిసినప్పుడు తమ్ముళ్లు చెప్పేవాళ్లు, నువు ఒకసారి వచ్చి చూచి వెడితే బాగుండేదని. అప్పుడు అనిపించేది - తను ఎందుకు అలా చేయలేదు? అని. ఏ విషయాన్ని గురించీ ఎక్కువ గంభీరంగా తీసుకోకుండా, జీవితాన్ని ఎలా ప్రాప్తం అయితే అలాగే అనుభవించడానికి సిద్ధపడి కూర్చున్న అనాసక్తుడు, అశక్తుడు తను.

"అందుకని, యిప్పుడు వచ్చాను" అన్నాడు అతను.

కీర్తి మళ్లీ రిక్షాలో కూర్చున్న మనిషి అయ్యాడు.

"రెండు సార్లు తిరగబెట్టిందండీ మాయరోగం."

– ఏమిటి దానిపేరు? ఏ పేరు అయితేనేం... అన్నీ ఒక్కటే. మనిషిని అతలాకుతలం చేయటానికీ, మలుపు తిప్పి ముంచి వేయటానికి అది యేరోగం అయితేనేం?

"నేను వచ్చినప్పటి నుంచి కాస్త నయంగానే ఉన్నదిలెండి. ఇప్పుడు లేచి గదిలో తిరుగాడుతోంది. తిన్నది వంట బడుతున్నది. మరే భయంలేదు" అన్నాడు అతను.

అమ్మయ్య - అనిపించింది కీర్తికి. పైకి "సంతోషం" అన్నాడు.

"వైద్యానికి బాగా ఖర్చయిపోయింది లెండి. అయితేనేం గానీండి, మనిషి దక్కింది - అంతేచాలు" అన్నాడు.

గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్లలేదా? అక్కడ డాక్టర్లు సరిగా చూడలేదా? అపరేషన్లు చేయాలన్నారా?.... యీ ప్రశ్నలన్నీ అడగడం అనవసరం అనిపించింది కీర్తికి. అంతా చెప్పక చెప్పతున్న సమాచారం.

"మా పెద్దనాయన తలతాకట్టు పెట్టి ఎట్లాగో కర్చుకు డబ్బులు మాత్రం కూడ గట్టగలిగాడండీ."

- గండం గడిచి గట్టెక్కాడన్నమాట.

"అవునండీ. అయితే మాత్రం యిల్లు గడవడం ఎంత కష్టం అయిపోతోందనుకున్నారు?... మా పెద్దనాయనకు యిద్దరు కొడుకులు. ఇద్దరూ నాకంటె పెద్దవాళ్లేలెండి. పెళ్లిళ్లయి వాళ్లకుటుంబాలు వాళ్లు చూచుకుంటున్నారు. ఉండటానికి అందరూ ఒకచోటే. అదో సౌకర్యం."

ఇతనికి పెళ్లి అయిందోలేదో - అయ్యే ఉంటుంది, కాకపోతే చెప్పేవాడేగా.

"వాళ్లిద్దరూ పెద్దగా చదవుకోలేదండీ."

– అదో నేరంకాదులే అనిపించింది.

"ఇద్దరూ బండి వేస్తారు ఇక్కడే."

"సొంతమేనా?" అనడిగాడు కీర్తి. జీవనోపాధికి అవసరం అయిన సరంజామా మనిషికి 'సొంతం' గానే అమరిఉండాలని కీర్తి సిద్ధాంతం. ఏదీ అరువు సరుకు కాకుడదు. తలనెప్పి తీసుకురాగూడదు. ఏదయినా వ్రాయాలనుకున్నప్పుడు కాగితము, కలము అరువు తెచ్చుకోవడానికి బయలుదేరుతామా?... అలా వెళ్లే స్థితిలోనే ఉంటే, ఆ వ్రాత ఎంత లక్షణంగా ఉంటుంది?

"కాదండీ ఇద్దరూ బాడుగకే తీసుకున్నారు."

బ్యాంకులకు వెళ్ళి సొంతంగా బండ్లు అమర్చుకుందుకు సదుపాయం ఉన్న దని చెప్పాలనిపించింది కీర్తికి.

"అయినా కామందు మంచివాడులెండి. ఎక్కువ కిరాయి తీసుకోడు. బండికి యేం రిపేరు వచ్చినా సణుక్కోకుండా చేయిస్తాడు."

చీకట్లో వెన్నెల "ఇంతకూ సంగతేమిటంటేనండి."

ఎదురుగా కారు వస్తోంది. దానికి తోవయిస్తూ యితను కాస్త పక్కకు జరిగాడు.

వెనుకనుంచి మరో రిక్షా ముందుకు దూసుకుపోయింది. "మా పెద్దమ్మ నన్ను ఒక నెలరోజులయినా ఇక్కడ వుండకుండా వెళ్లటానికి వీల్లదన్నదండీ. 'నా మీద వట్టే' అంది"

నెలరోజులు స్వగ్రామం సొంత పనులు వదులుకుని - మనిషి మరోచోట ఎలా వుంటాడు? ఎంతకర్చు. ఎంత యిబ్బంది. ఎంత అసౌకర్యం... "మరేం చేయనండి. మా పెద్దమ్మ నన్ను కట్టి పడేసిందండి. పొట్టు తీసి గట్టున పెట్టటానికి లేదండీ. అందుకనే ఉండిపోయాను..."

"రోజూ పదినోళ్లు ఆడాలండి. పది పొట్టలు నిండాలండి. నేనేమో రెండ్రోజుల్లో మూడు రోజుల్లో చుట్టపుచూపుగా వస్తే నన్నిక్కడ కట్టేశారండి. ఊరికే కూర్చుని తింటూ సోమరిపోతుగా యెలా వుండనండీ?"

– న్యూస్‌పేపర్లు చదువుతూ, రేడియో వింటూ, టి.వి. చూస్తూ... అనుకున్నాడు మనసులోనే కీర్తి.

"పెద్దమ్మంటే పేరుకు పెద్దమ్మ కానీండి. నన్ను చిన్నతనంలో పోషించి నాలుగు అక్షరమ్ముక్కలు నేర్పించి మనిషిని చేసిందండీ."

ఋణానుబంధం పెరిగిపోతోంది.

"అందుకే మా పెద్దమ్మ మాట నేను కాదనలేదండి!"

అక్కడ పెళ్లాం పిల్లలు...

"పెద్దమ్మ చెప్పిందండీ వాళ్లను కూడా తీసుకురమ్మని. కాని పిల్లగాళ్లకు చదువులండీ. చదువును అశ్రద్ధ చేయటానికి లేదు కదండీ. శనాది వారాలు వచ్చి వెడతారండీ."

"బాగుంది."

"నెల్రోజులు వాళ్ల యింటిమీద పడి తినడం నాకు రుచించదండీ"

కీర్తికి ఎన్నో జ్ఞాపకాలు.

బంధువులు బలగంగా వచ్చి నెలల తరబడి ఉండడం... వాళ్ల వినోద యాత్రలు, వేడుక కోసం కొనుక్కునే వస్తువులు... వాళ్లు వెళతానన్నా మరో నాలుగు రోజులుండండి - అప్పుడే వెళతానంటేరేం... వచ్చి వారమయినా అయినట్లు లేదు అంటూ యింట్లో పెద్దవాళ్లు. సరంజామా పోగుచేసుకోవడం, అందరికీ అన్ని అమర్చి వేళలకు సరిపోయేటట్లు నడుచుకోవడం... ఓహ్ ఎంత గందరగోళం! - ఓ మనిషి పైగా ఉన్నాడంటే - అతని రుచులు కనిపెట్టి చేసుకుంటూ పోవాలి, అన్ని పనులూ.

"అందుకని మా అన్నలకు చెప్పానండీ, నాక్కూడా ఓ బండి యిప్పించండిరా. రాత్రిపూట నాలుగ్గంటలు లాక్కుంటానని. వాళ్ళు ముందు ఒగ్గలేదండీ. బస్తీ మనిషివి, సుతారంగా గేట్లో నించుని టిక్కెట్లు చింపేవాడివి... నువ్వేం కష్టపడతావురా - అని ఒకటే సతాయించండీ."

అవును ఎవరయినా చూస్తే?

"ఈ ఊళ్ళో నాకు తెలిసినవాళ్లు ఎవరూ లేరండీ. అయితే మాత్రం ఏమండి? రాత్రిపూట వేస్తేనే మంచిది. మనమేం దొంగతనం చేయడంలేదు గదండీ."

సాయంత్రం అయిదునుంచి - రాత్రి తొమ్మిదిదాకా.

ముందు యాత్రికుల రద్దీ. తరువాత సినిమాలకు వెళ్లేవాళ్లు.

"మనిషికి ఓపిక వుండి పని చేసుకోవాలిగానీండి, డబ్బుకేమీ దరిద్రం లేదండి. రోజూ ఎంత లేదన్నా యిరవయ్యి, యిరవయి అయిదు రూపాయలు మిగల్తున్నా యండి. నాకు కర్చులేదండీ. బీడీలకు, సోడాలకు నేను తెచ్చుకున్న డబ్బులే ఉన్నాయి."

కీర్తికి చాలా సంతోషం అయింది. అతని ఎకనమిక్స్‌కు, ఎడాప్టబిలిటీకి. సంపన్నుడంటే యితను. అవసరం కనిపెట్టి సంపాదించేవాడు.

"మాపెద్దాయన బాకీ కొంతయినా తీరుస్తానండీ. పెద్దమ్మ కోకోక, చిన్న పిల్లగాళ్లకు బట్టలు తీస్తానండీ వెళ్లేటప్పుడు"

కీర్తికి మళ్ళీ కళ్లు చెమర్చాయి.

"బండి తొక్కడం నాకేం కష్టంలేదండీ. అయినా యిది దొరకడం నా

అదృష్టం లెండి... ఇప్పుడు యింటికి వెళ్ళగానే ఉడుకుడుకు నీళ్ళ స్నానం చేస్తానండి. అన్నం తేసి సినిమాకు వెళతానండి. అక్కడితో ఆ పని అయి పోతుంది."

- ఒక్కక్షణం విరామం యిచ్చి యేదో మరిచిపోయినవాడు గబగబ గుర్తు చేసుకు చెబుతున్నట్లుగా అన్నాడు.

"బాబూ మీరేమనుకున్నారో ముందు. నేను మాత్రం బండి పక్కన మిమ్మల్ని చూడనేలేదండి. బీడికాల్చుకుంటున్నంతసేపు గబగబ యింటికి వెళ్ళి నాలుగు ముద్దలు తిని సినిమాకు పోదామన్న ఆలోచనలోనే ఉన్నాను. అసలు నేను బండి ఆపిన క్షణమే ఒకాయన వచ్చారండీ. చాలా దూరంఅని రానన్నానండీ. మళ్ళీ తొమ్మిదింటికి సినిమాహాలు దగ్గర ఉండాలిగదండీ... అందుకనే మీరు అడిగినప్పుడు టైమెంతయింది అని అడిగానండీ. మీరు యేమనుకున్నారో..."

ఏం అనుకున్నాడో గుర్తులేదు కీర్తికి.

"బండి కట్టరా బండ సన్నాసీ - అంటే టైం ఎంతని అడుగుతాడేం వీడు - అని కోపగించు కున్నారోయేమో... నా ఉద్దేశ్యం మటుకు ఎలాగయినా యీ సినిమా చూసేవని ముగించేయాలనండి. అందుకనే మిమ్మల్ని టైం అడి గాను. ఆ ... వచ్చేశామండి డీలక్సేనా లేక పక్కరోడ్ మీదకు పోవాలా చెప్పండి" అన్నాడు.

కుడివయిపు గుడిద్వారం - దేదీప్యమానంగా వెలిగిపోతున్న గోపురం స్తంభాలు కనబడుతున్నాయి. లోపలకు బయటకూ యింకా జనసంచారం సందడిగానే జరుగుతోంది.

కీర్తి గెస్ట్ హౌస్‌కు వెళ్లాలి. ఇక్కడికి మరో అయిదు నిమిషాల నడక. ముందు టిఫిన్, కాఫీ పని అలాగే ఉంది. అందుకని డీలక్స్ దగ్గరే దిగిపోయాడు.

దిగిన తరువాత గుర్తుకు వచ్చింది, రిక్షా అతనితో బేరం కుదుర్చుకోలేదని. అయినా యితను డబ్బు యివ్వచూపితే వద్దనేస్తాడేమోనని కూడా భయం. ఆశ!

ఎంత? అని అడిగితే "మీకు తెలుసు గదండీ" అని స్టాక్ రిప్లయ్ యిస్తాడు. అందుచేత అయిదు రూపాయలు కాగితం అందించాడు. చిల్లరయిస్తే తీసుకో వచ్చు. లేకపోతే లేదు.

అతను 'రెండు' కాగితం వాపసు యిస్తుంటే చేతులు వణికాయి తీసుకోవ

డానికి. "వద్దులే. ఉంచు. సినిమాకు వెళుతున్నావుగదా!" అన్నాడు.

"థాంక్సండీ. టైం యింకా ఎనిమిది నలభయి కాలేదుకదండీ, నిదానంగా వెళ్ళినా బోలెడు టైం ఉంటుందదండీ, వెళ్ళి వస్తాను. సెలవు బాబూ" అన్నాడు అతను రిక్షాను వెనక్కి మళ్ళిస్తూ.

కీర్తి బ్రీఫ్‌కేస్‌తో డీలక్స్‌లో ప్రవేశిస్తూ ఏం తింటే బాగుంటుందా అని ఆలోచించసాగాడు.

ఆ తరువాత రూం తాళం తీస్తున్నప్పుడు గాని గుర్తుకురాలేదు - గెస్ట్ హౌస్‌వాళ్ళ తాళం మీద తన సొంత తాళం గూడా వేలాడుతోంది - తాను ఆ రిక్షా అతనిపేరు యేమిటో కనుక్కోవడం మరిచిపోయానని. అతన్ని గురించి ఎన్నో సంగతలు తెలుసు, పేరు మాత్రం తెలియదు.

అతనిపేరు యేదయితేనేం. తలుచుకున్నప్పుడు మాత్రం తప్పకుండా మనసుకు 'ఆనందం' అవుతుంది - అనుకున్నాడు తృప్తిగా ఫోంబెడ్ మీద శరీరాన్ని జారవేస్తూ.

*